క్లుప్తంగా

యూనిఫాం పంపిణీ

టేకులపల్లి: టిప్పర్ డ్రైవర్లు యూనిఫాంను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం టిప్పర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిప్పర్ డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. మాట్లాడుతూ డ్రైవర్లు యూనిఫామ్ ధరించి విధులకు హాజరు కావాలని అప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. డ్యూటీలో బాధ్యతగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, నేలవెల్లి నరసింహారావు, అరవ వెంకట్ పాల్గొన్నారు.

ధూమ్ ధామ్‌గా దసరా వేడుకలు



రామాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమం

టేకులపల్లి: విజయ దశమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం వద్ద దేవీశరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ షో ఆకట్టుకుంది. తొలుత మహా అన్నప్రసాద వితరణ చేశారు. తరువాత అమ్మవారి వస్త్రాలు, కలశం తదితరములు వేలంపాట నిర్వహించారు.

సింగరేణిలో రక్తదాన శిబిరం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆదేశాలతో బుధవారం సింగరేణి ఆస్పత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కొత్తగూడెం ఎంవీటీసీ నుంచి 40 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ తరుపున వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఏసీఎంఓ ఉష, సునీల, అవినాష్, హెల్త్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెడుపై విజయమే విజయదశమి



కొత్తగూడెం రైటర్ బస్తీలోని గణేష్ ఆలయం వేడుకలకు సిద్ధమైన ప్రాంగణం

- పండుగకు ఆయుధపూజ ప్రత్యేకం
- శమీ పూజలు, రావణ దహనానికి ఏర్పాట్లు
- పలుచోట్ల సిద్ధమైన వేదికలు

కొత్తగూడెంటౌన్: మంచిపై చెడు గెలుపుకు చిహ్నంగా దసరా పండుగను ప్రజలందూ ఘనంగా జరుపుకుంటారు. రాముడు రావణుడిపై గెలిచిన సందర్భాన్ని గుర్తు చేసుకుని, అదేవిధంగా పాండవులు వనవాసం వెళ్తూ తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై ఉంచి, తిరిగి వచ్చి తీసుకున్న రోజును విజయదశమిగా పిలుస్తారని పురాణంలో ఉంది. దసరా పండుగను గురువారం ఘనంగా జరుపుకునేందుకు సర్వం సిద్ధమైంది. ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీనవరాత్రులు... పదో రోజు విజయదశమి వస్తుంది. ఈ రోజునే దసరా పండుగ చేసుకుంటారు.

అమ్మవారికి దసరాకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఆటలతో పాటు బొమ్మల కొలువు చేయడం అనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు, మండపాలను రంగులతో అలంకరించి, విద్యుత్ దీపాలతో నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దసరా రోజున శమీపూజ, రావణదహనం వంటి కార్యక్రమాలతో పాటు ప్రజలు వాహనపూజలను సైతం చేస్తారు. ఆలయాల్లో జమ్మి చెట్టు వద్ద పూజలకు ఏర్పాట్లు, ఇలా ఎటు చూసినా దసరా పండుగ వాతావరణం కనిపిస్తోంది.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించండి..



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవి

జూలూరుపాడు: ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఎంపీడీఓ తాళ్లూరి రవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో రాజకీయ పక్షాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన రోజు నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలు ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ అదే రోజున నామినేషన్లు స్వీకరణ ప్రారంభమై 17న ముగుస్తుందన్నారు.

మండలంలో 42,068 మంది ఓటర్లు

టేకులపల్లి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రకటించడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. టేకులపల్లి ఎంపీపీ ఎస్టీ మహిళకు, జెడ్పీటీసీ జనరల్ మహిళకు కేటాయించారు. తాజాగా ప్రకటించిన రిజర్వేషన్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీల పరిధిలో సామాజిక వర్గాల వారీగా ఏ వర్గానికి ఎన్ని ఓట్లు అనే కోణంలో రాజకీయ నాయకులు సమాలోచనలు చేస్తున్నారు. టేకులపల్లి మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 312 వార్డులు, 312 పోలింగ్ కేంద్రాల పరిధిలో పురుషులు 20,677, మహిళలు 21,391 మొత్తం 42,068 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రజలకు పోలీసుల 'దసరా' భరోసా



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ప్రజలు ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను తెలిపారు. బుధవారం ఇల్లెందు డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దసరా ఉత్సవాల కోసం జేకే సింగరేణి ఫారెస్టు గ్రౌండ్ ముస్తాబయిందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దసరా ఉత్సవాలలో రాజకీయాలకు అవకాశం లేకుండా చూసుకోవాలని కోరారు. ఈసారి 80 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో నాలుగు బ్లూకోట్స్ బ్యాచ్‌ల నిఘా, ట్రాఫిక్ మళ్లింపు కూడా ఉంటుందని తెలిపారు. ఆయా బస్తీల్లో ఆశీనులైన దుర్గామాత మండపాల నుంచి అమ్మవారి రథాలు సకాలంలో జమ్మి గ్రౌండ్‌కు తరలించుకునేలా చూసుకోవాలని సూచించారు. ఈసారి రౌడీ షీటర్ల కదలికల మీద ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దసరా పర్వదినం రోజే గాంధీ జయంతి వచ్చినందున మద్యం, మాంసం దుకాణాలు బంద్ పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నికల నియమావళి పాటించండి..

టేకులపల్లి: స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలని సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు, విద్యా సంస్థల్లో ఎలాంటి రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు, హోర్డింగులు ఉండకూడదని పేర్కొన్నారు.

సింగరేణి సీఎండీని కలిసిన వైరా ఎమ్మెల్యే

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి హెడ్డాఫీసులో బుధవారం సీఎండీ బలరామ్‌ను వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైరా నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. సింగరేణి అడ్వకేట్ వెల్లంకి వెంకటేశ్వరరావు, నరసింహారావు, కృష్ణ, విగ్నేష్, బోడ గణేష్ పాల్గొన్నారు.

సింగరేణి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని సీఎండీ ఎన్.బలరామ్‌కు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థులను మానసికంగా, ఉత్తేజవంతులుగా చేయడానికి విద్యాసంస్థలో ఎన్‌సీసీ ఏర్పాటు చేయాలని, సింగరేణి జూనియర్, డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థుల కోసం కాలేజీ అటాచ్డ్ హాస్టల్ అనుమతులు తీసుకరావాలని, సింగరేణి సీఎండీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ కిందిస్థాయి అధికారుల్లో చలనం లేదన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: కేటీపీఎస్ ఎ కాలనీలో నివాసం ఉండే నవీన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పనికి వెళ్లిన క్రమంలో చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్ విషయం తెలుసుకుని బుధవారం రూ.31వేలు ఆర్థిక సహాయం అందించారు.

సెప్టెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు ఏరియాలో 43 శాతం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సెప్టెంబర్ 2025 బొగ్గు ఉత్పత్తి వివరాలను బుధవారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్య వెల్లడించారు. నిర్దేశించిన లక్ష్యం 4.42 లక్షల టన్నులకు గాను 1.88 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 43 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు.

కొత్తగూడెం ఏరియాలో 97శాతం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సెప్టెంబర్‌లో కంపెనీ నిర్దేశించిన 11,52,700 లక్షల టన్నుల లక్ష్యానికి 11,14,530 లక్షల టన్నులు 97శాతం సాధించింది. అదే విధంగా గడచిన ఆరుమాసాల్లో 6.92 మిలియన్ టన్నుల లక్ష్యానికి 7.03 మిలియన్ టన్నులు సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందని అధికారులు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

జూలూరుపాడు: స్థానిక ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగానే పోటీ చేస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. బుధవారం జూలూరుపాడు పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల బరిలో సీపీఎం అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. పలుమార్లు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన అనుభవం ఉందని చెప్పారు. సీపీఎంతో కలిసి వచ్చే లౌకిక పార్టీలతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యాసా నరేష్, బానోత్ మధు, బానోత్ ఇస్రా, పద్దం సుగుణ, వల్లమల్ల చందర్‌రావు, మాలోత్ రాములు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, తాటి పద్మ, ధరావత్ రమేష్, పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

సుజాతనగర్: రామవరం రేంజ్ అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో నిమ్మలగూడెం గ్రామం వద్ద బుధవారం వాహన తనీఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో అటవీ జంతువులను వేటాడే అవకాశం ఉన్నందున నాకాబంధీలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని, వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వన్యప్రాణులు, అటవీ సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలన్నారు.